సాక్షి
యాదాద్రి భువనగిరి

ఆదివారం । 1 । జనవరి । 2023



యూత్ కాంగ్రెస్ నాయకుల అరెస్టు

ప్రగతి భవన్ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు యూత్ కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. - 9లో



వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ ఏర్పాటు

పోచంపల్లిలోని బస్టాండ్ స్థలంలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ ఏర్పాటు చేయాలని పాలకవర్గం తీర్మానించింది. - 9లో

గరిష్టం/కనిష్టం
32.0°/18.0°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి మోస్తారుగా ఉంటుంది.

ఈ ఏడాదే పవర్ ప్లాంట్

- పనులు వేగవంతం చేస్తాం
- ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు
- ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు
- 'సాక్షి'తో మంత్రి జగదీశ్‌రెడ్డి



నల్లగొండ : కొత్త సంవత్సరంలో యాదాద్రి అల్ట్రా మెగా పవర్‌ప్లాంట్ మొదటి దశను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. 2023 కొత్త సంవత్సరంలో అదే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. పవర్‌ప్లాంట్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న పనులను మరింత వేగవంతం చేస్తామని చెప్పారు. ప్రాజెక్టును అడ్డుకునే కుట్రలను అధిగమించి రెండు మూడు దశల పనులను కూడా రెట్టించిన వేగంతో ముందుకు తీసుకెళ్తామని వివరించారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, వాటిని మరింత వేగవంతం చేస్తామన్నారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు మెడికల్ కాలేజీలు ఇచ్చారని, నల్లగొండలో మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణ పనులను పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. ఉమ్మడి జిల్లాలో గతంలో ఎన్నడూ చేయలేనంతగా అభివృద్ధి పనులను చేపట్టామని, వాటిని 2023 సంవత్సరంలో పూర్తి చేసేలా చేస్తామన్నారు

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రణాళికలు

యావత్ తెలంగాణ సమాజం సుభిక్షంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పమని మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు ప్రజల ఆకాంక్షలకు తగిన ప్రణాళికలు రూపొందించి సుభిక్షమైన పాలనను అందించి కొత్త ఒరవడిని సృష్టించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. అదే ఒరవడితో నూతన సంవత్సరంలోనూ సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో రంగరించి ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా నిర్ణయాలు ఉంటాయన్నారు. ముందుగా ఆయన ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు నూతన సంవత్సరంలో తీసుకోబోయే నిర్ణయాలు వారి అభ్యున్నతికి దోహదపడలని ఆకాంక్షించారు.

● న్యూ జోష్





నూతన సంవత్సర వేడుకలను జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ 2022కు వీడ్కోలు పలికారు. కేకులు కట్ చేసి, రంగులు చల్లుకుని సంబరాల్లో మునిగితేలారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. - సాక్షి యాదాద్రి

సరి 'కొత్త'గా పాలన

జిల్లాను మరింత ప్రగతిపథంలో నడిపిస్తాం

- ధరణి సమస్యలన్నీ పరిష్కరించడమే లక్ష్యం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ పమేలా సత్పతి
- ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



సాక్షి INTERVIEW

సాక్షి, యాదాద్రి : 2022లో విద్య, వైద్యం మహిళా సాధికారతతో పాటు పలు కార్యక్రమాలు సత్ఫలితాలిచ్చాయి. కొత్త సంవత్సరంలోనూ నూతన ఒరవడితో పాలన సాగిస్తాం. ఉద్యోగులతో సమన్వయం, ప్రజల సహకారంతో జిల్లాను మరింత ప్రగతి పథంలోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పని చేస్తాం' అని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కొత్త ఏడాదిలో చేపట్టనున్న కార్యక్రమాలు,లక్ష్యాలపై శని వారం సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూ ఆమె మాటల్లోనే..

ధరణి ఫిర్యాదులన్నీ పరిష్కరిస్తాం

ధరణి పోర్టల్ నెలకొన్న వివిధ రకాల సమస్యలపై జిల్లా వ్యాప్తంగా 70వేల ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 68 వేలు పరిష్కరించి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచాం. మరో 2వేల దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి. నూతన సంవత్సరంలో వాటన్నింటినీ పరిష్కరించి రైతులకు ఇబ్బంది లేకుండా చేయడమే లక్ష్యం. వీటితో పాటు వక్ఫ్, దేవాదాయ భూములకు సంబంధించి విధానపరమైన సమస్యలు ఉన్నాయి. వాటిని ప్రభుత్వానికి నివేదించాం.

పాఠశాలల్లో వినూత్న కార్యక్రమాలు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో భాగంగా జిల్లాలో ఇప్పటికే తొలిమెట్టు, స్నేహిత వంటి కార్యక్రమాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నాం. విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపి ఉత్తమ ఫలితాలు సాధించేలా కొత్త ఏడాది మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపడుతాం.

మహిళల్లో రక్తహీనత తగ్గిస్తాం


జిల్లాలో బాలికలు, మహిళల్లో రక్తహీనత అధికంగా ఉండేది. గతంలో 72 శాతం రక్త హీనత రికార్డు అయ్యింది. శుక్రవారం అంగన్‌వాడీ సభ కార్యక్రమం ద్వారా ఎన్నో మార్పులు తీసుకువచ్చాం. రక్తహీనత ఉన్నవారిని 22 శాతానికి తగ్గించాం. కొత్త సంవత్సరంలో పూర్తిగా తగ్గించడమే లక్ష్యం.

సాధారణ కాన్పులు పెంచుతాం

జిల్లాలో సాధారణ ప్రసవాలు పెంచాలనుకున్నా లక్ష్యం చేరలేకపోయాం. గతంతో పోలిస్తే 20 శాతం వరకు తగ్గాయి. కొత్త సంవత్సరంలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచడానికి చర్యలు చేపడుతాం. జిల్లా కేంద్ర ఆస్పత్రి, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల మధ్య సమన్వయం పెంచుతాం. జాయింట్ రివ్యూలు చేపడుతాం. లక్ష్యం దిశగా సాగుతాం.

న్యూస్‌రీల్

పంచ నారసింహుడికి నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ముఖమండపంలో ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన గావించారు. ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవోత్సవం చేపట్టారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు



గ్రామ సభలో మాట్లాడుతున్న జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి

చౌటుప్పల్ : నిజమైన అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తామని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మాన్యానాయక్ తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు కోసం చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో శనివారం సర్పంచ్ ఎలువర్తి యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఇళ్లకోసం 184 దరఖాస్తులు రాగా గ్రామసభ ద్వారా 120 మందిని అర్హులుగా గుర్తించినట్లు చెప్పారు. అభ్యంతరాల కోసం మూడు రోజులు గడువు ఉంటుందన్నారు. మరోసారి గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీడీఓ సందీప్‌కుమార్, ఆర్ఐ.రాంరెడ్డి, ఎంపీటీసీ చిట్టంపల్లి శ్రీనివాస్‌రావు, ఉపసర్పంచ్ మల్కాజిగిరి కృష్ణ, వార్డు సభ్యులు, గ్రామస్థులు ఉన్నారు.

కొనసాగుతున్న బస్వాపూర్ నిర్వాసితుల దీక్ష



దీక్ష చేస్తున్న బీఎన్ తిమ్మాపురం గ్రామస్తులు

భువనగిరి : బస్వాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురువుతున్న బీఎన్ తిమ్మాపురం గ్రామస్తులు పరిహారం కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 33 రోజుకు చేరాయి. పట్టా, కబ్జా భూములకు పరిహారం చెల్లించడంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. గృహ నిర్మాణం కోసం ప్లాట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిన్నం లతరాజు, ఉప సర్పంచ్ ఎడ్ల దర్శన్‌రెడ్డి, రావుల నందు, పన్నీర్ బాలరాజు, పిన్నం ధనరాజ్, పుండరీకం, సాయి, హరనాథ్, బాలయ్య, శివనందు, గంగాదేవి పాల్గొన్నారు.

మండలం ఏర్పాటుకు సహకరించాలని వినతి



కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేస్తున్న రఘునాథపురం గ్రామస్తులు

రాజాపేట : మండలంలోని రఘునాథపురంను మండలం చేయాలని కోరుతూ పొట్టిమర్రివద్ద 144 రోజులుగా జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష గ్రామస్తులు శనివారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం అందజేశారు. విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి గెజిట్ విడుదల చేసే విధంగా చూడాలని కోరారు. మండల ఏర్పాటు కోసం తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాడిపల్లి శ్రవణ్, సీపీఐ రాష్ట్ర కార్మిక సంఘం కార్యవర్గ సభ్యుడు కొల్లూరి రాజయ్య, నాయకులు ఎండీ దస్తగిరి, కర్నాటి రాజేష్, మాజీ సర్పంచ్ గుర్రం సిద్దిరాములు, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు బొడ్డుల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ కార్యాలయానికి తాళం



ఏఈ కార్యాలయానికి తాళం వేస్తున్న పంచాయతీ సిబ్బంది

వలిగొండ : మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయానికి పంచాయతీ సిబ్బంది శనివారం తాళం వేశారు. గ్రామ పంచాయతీకి గత కొన్నేళ్లుగా రూ.5,58,000 బకాయి ఉంది. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు సమాచారం ఇచ్చినా స్పందించకపోవడంతో తాళం వేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఈ ఘటనపై విద్యుత్ ఏఈ మశ్చేందర్ మాట్లాడుతూ పన్ను బకాయి వివరాలను ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపామని, బడ్జెట్ విడుదల చేయగానే చెల్లిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోళ్ల లలిత శ్రీనివాస్, ఉప సర్పంచ్ మైసోళ్ల మత్స్యగిరి,వార్డు సభ్యులు కుర్షిద్, యాదగిరి, సుధాకర్, స్వాతి, నిర్మల, యాదలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● 2022కు భానుడి బైబై



2022 సంవత్సరానికి భానుడు బైబై చెప్పాడు. శనివారం సాయంత్రం భువనగిరి మండలం రాయగిరి చెరువు వద్ద సూర్యుడు అస్తమిస్తూ ఇలా కనిపించాడు. -సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి

జమ ఖర్చులు చెప్పాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి

భువనగిరిటౌన్ : అక్టోబర్, నవంబర్‌లో చూపించిన జమా ఖర్చుల వివరాలను తెలియజేయాలని కోరుతూ బీజేపీ కౌన్సిలర్లు శనివారం కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఇతర ఖర్చుల కింద నిధులు కేటాయించినట్లు చూపారని వెంటనే వివరాలను చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాయ దశరథ, కౌన్సిలర్లు నల్ల మాస సుమా, జనగాం కవిత, ఊదరి లక్ష్మి, ఉదయగిరి విజయ్‌కుమార్, బొర్ర రాకేష్, రత్నపురం బలరాం పాల్గొన్నారు.

గ్రామసభలో రసాభాస

బీబీనగర్ : మండలంలోని కొండమడుగు పరిధిలో గల చత్రఖానిగూడెంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో భాగంగా శనివారం కొండమడుగులో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో సభను అధికారులు రద్దు చేశారు. గ్రామంలో 281 మందిని ఎంపిక చేసి కేవలం 30 ఇళ్లను మాత్రమే నిర్మించి ఇవ్వడం సరికాదన్నారు. అంతేకాకుండా సర్వే పారదర్శకంగా చేపట్టలేదని, పాలకవర్గం చొరవతో అర్హులు కాని వారికి, స్థానికేతరులను ఎంపిక చేశారని గ్రామస్తులు ఆరోపించారు. స్థానికులకు ప్రాధాన్యం ఇచ్చేలా సమగ్రంగా సర్వే చేపట్టి లబ్ధిదారుల జాబితా మరోసారి రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. దీంతో గ్రామ సభను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. మరోసారి గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజల సమక్షంలో లబ్ధిదారుల తుది జాబితాను వెల్లడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అన్నపూర్ణ, సర్పంచ్ లతరాజేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

మిగిలింది మూడు నెలలే!

- భువనగిరి మున్సిపాలిటీలో నల్లా పన్నుపై ఉదాసీనత
- రూ.1.40 కోట్ల బకాయిలు
- వసూళ్లపై దృష్టి సారించని అధికారులు



భువనగిరి మున్సిపల్ కార్యాలయం

భువనగిరి : మున్సిపాలిటీకి సమకూరే ప్రధాన ఆదాయ వనరుల్లో నల్లా పన్ను ఒకటి. కానీ, భువనగిరి మున్సిపాలిటీలో ఏ సంవత్సరం కూడా పూర్తి స్థాయిలో పన్ను వసూలు కాలేదు. ప్రస్తుతం రూ.1.40కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో మూడు నెలలే గడువు ఉన్నందున అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప.. వసూలయ్యే అవకాశం లేదు.

బకాయిలు ఇలా..

మున్సిపాలిటీ పరిధిలో 35 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల్లో 65వేలకు పైగా జనాభా ఉంది. తెల్లరేషన్ కార్డు కలిగిన వ్యక్తులకు ఒక్క రూపాయి, పింక్ కార్డు ఉన్నవారికి రూ. 100, దుకాణదారులకు రూ.14వేలకు నల్లా కనెక్షన్ ఇస్తున్నారు. కాగా కనెక్షన్‌కు ప్రతి నెలా రూ.100 చెల్లించవల్సి ఉంటుంది. మున్సిపాలిటీలో 2022 – 23 సంవత్సరానికి మొత్తం రూ.2.9 కోట్లు రావల్సి ఉంది. కొంతమంది ఏళ్ల తరబడి పన్ను చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. ఒక్కో కనెక్షన్‌దారుడు రూ.1000 నుంచి రూ. 2వేల వరకు బకాయి ఉన్నట్లు తెలుస్తోంది.

నల్లా కనెక్షన్లు ఇలా..	
మొత్తం	8,571
డిమాండ్	రూ. 2.9 కోట్లు
బకాయి	రూ.1.40 కోట్లు

ఆన్‌లైన్‌లో నమోదుకాని భగీరథ కనెక్షన్లు

మున్సిపాలిటీలో బొమ్మాయిపల్లి, పగిడిపల్లి, రాయగిరి గ్రామాలు విలీనం అయ్యాయి. ఆయా గ్రామాల్లో సుమారు 2వేల వరకు మిషన్ భగీరథ కనెక్షన్లు ఉన్నాయి. వీటిని ఇంకా ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు.

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం

నల్లా పన్ను వంద శాతం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మరో 3 నెలల వ్యవధి ఉన్నందున పన్ను వసూలుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యం రూ.2.9 కోట్లు కాగా 50 శాతం వసూలు చేశాం.

– నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

డాక్టర్ పోస్టులన్నీ ఖాళీ!

అస్తవ్యస్తంగా మోత్కూరు పీహెచ్‌సీ

- సేవలందిస్తున్న ఏఎన్‌ఎంలు
- సౌకర్యాలూ అంతంతమాత్రమే
- ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులు



ఆపరేషన్ థియేటర్‌లో నిరుపయోగంగా ఉన్న పరికరాలు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అస్తవ్యస్తంగా మారింది. డాక్టర్ పోస్టులన్నీ ఖాళీగా ఉండడంతో ఏఎన్‌ఎంలే వైద్యసేవలు అందజేస్తున్నారు. దీంతో ఆస్పత్రికి వచ్చిన రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు మండలాలకు వైద్యపరంగా మోత్కూరు ప్రధాన కేంద్రం. ఆస్పత్రిని 30 నుంచి 50 పడకల స్థాయికి పెంచాలని ఈ ప్రాంత ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు మూడు దశాబ్దాలుగా కోరుతున్నారు. స్థాయి పెరగకపోగా ఇటీవలి కాలంలో డాక్టర్ పోస్టులన్నీ ఖాళీ ఏర్పడ్డాయి. ఏఎన్‌ఎంలే వైద్యం చేస్తుండటంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

పూర్తిగా తగ్గిన ఓపీ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు డాక్టర్లతో పాటు ఒక ఆయుష్ వైద్యుడు ఉండాలి. రెండేళ్ల క్రితం ఇద్దరు డాక్టర్లు ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. కొంతకాలం తర్వాత వారు పూర్తిస్థాయిలో బదిలీపై వెళ్లిపోయారు. 6 నెలల క్రితం ఆయుష్ డాక్టర్‌ను హన్మకొండకు డిప్యూటేషన్‌పై పంపారు. ఉన్న ఒక్కగానొక్క డాక్టర్ ఇటీవల పీజీ చదవడానికి వెళ్లిపోయారు. ప్రస్తుతం రామన్నపేటకు చెందిన ఒక డాక్టర్‌ను డిప్యూటేషన్ పంపారు. వీరితో పాటు ఎంపీహెచ్ఈఓ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫార్మాసిస్టు పోస్టులో ఇక్కడ డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. గతంలో 80 నుంచి 120పైచిలుకు ఓపీ వస్తుండేది. ఇటీవల పూర్తిగా ఓపీ పడిపోయింది. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వసతులూ లేవు

ఆస్పత్రిలో కాన్పుల వార్డులో బాత్రూంలు లేవు. సిబ్బంది సైతం బాత్రూంల కొరత ఉంది. ఆపరేషన్ థియేటర్ నిరుపయోగంగా మారింది. డాక్టర్లు, సిబ్బందితో పాటు సరైన సదుపాయాలు లేక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత్యంతరం లేక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

కౌన్సెలింగ్ అనంతరం కేటాయిస్తాం

మోత్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నది వాస్తవమే. ఈ విషయాన్ని గతంలో ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. ఇటీవల తాత్కాలికంగా ఒక్క డాక్టర్‌ను నియమించాం. త్వరలో జరగనున్న కౌన్సెలింగ్ అనంతరం ఆస్పత్రికి డాక్టర్లను కేటాయిస్తాం.

– యశోద, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

సిబ్బందిని నియమించాలి



మోత్కూరు పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలి. డాక్టర్ పోస్టులన్నీ ఖాళీగా ఉండడంతో వైద్యం అందక రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. పూర్తిస్థాయిలో వైద్యసిబ్బందిని నియమించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం. –బుర్ర శ్రీనివాస్, బీసీ రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షుడు

ఆస్పత్రి స్థాయి పెంచాలి



ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న నలుగురు డాక్టర్ల, సిబ్బంది పోస్టులను త్వరగా భర్తీ చేయాలి. ముఖ్యంగా మహిళా డాక్టర్‌ను నియమించాలి. అంతేకాకుండా ఆసుపత్రి స్థాయి పెంచాలి. మోత్కూరు వివిధ మండలాలకు ప్రధాన కూడలి. ఇక్కడి ఆస్పత్రిలో వైద్యసిబ్బంది లేకపోవడం వల్ల రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

– గుండు వెంకటనర్సు, సీపీఎం మోత్కూరు మండల కార్యదర్శి

జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక




బొమ్మలరామారం : మండలంలోని చీకటిమామిడిలో గల మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు.మేడ్చల్ జిల్లా గండి మైసమ్మ దుండిగల్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో వి.వరుణ్, బి.రామకృష్ణ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్-14 విభాగంలో వరుణ్ 3వ స్థానం, గ్రూపు విభాగంలో 4 బంగారు పతకాలు, 8 సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరిద్దరూ కేరళ రాష్ట్రంలో జనవరి 15న జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఆడుతారని పీఈఓ భాస్కర్ తెలిపారు. విద్యార్థులను ఆర్‌సీఓ శ్రీనివాస్‌డ్డి, ప్రిన్సిపాల్ స్వప్న, అభినందించారు.

















మహిళలు సద్వినియోగం చేసుకోవాలి


షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరిటౌన్: వివిధ సెక్టార్ల కింద మహిళలు తయారుచేసిన వస్తువులను విక్రయించేందుకు యాదాద్రి జిల్లా కలెక్టరేట్‌లో నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న కాంప్లెక్స్‌ను శనివారం ఆమె పరిశీలించి మాట్లాడారు. మహిళలు తయారు చేసిన వస్తువులకు మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు ఈ కేంద్రం ఒక ప్లాట్‌ఫాంగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అధికారులు కృష్ణారెడ్డి, మందడి ఉపేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భీంరెడ్డి నర్సింహారెడ్డి శతజయంతి వేడుకలు


బీఎన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఎన్ స్మారక కమిటీ సభ్యులు

నాగారం: మండల పరిధిలోని ఫణిగిరిలో భీంరెడ్డి నర్సింహారెడ్డి శతజయంతి వేడుకలను శనివారం బీఎన్ స్మారక కమిటీ, ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎన్ చిత్రపటానికి బీఎన్ స్మారక కమిటీ అధ్యక్షుడు కొత్తగట్టు మల్లయ్య పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భీంరెడ్డి నర్సింహారెడ్డి భూమి కోసం, భుక్తికోసం పోరాటం చేశారని అన్నారు. శ్రీరాంసాగర్ కాలువకు బీఎన్ పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫణిగిరిలో బీఎన్‌తో కలిసి పనిచేసిన వారిని శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ నెల 9న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే బీఎన్ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గట్టు నర్సింహారావు, పత్తేపురం యాదగిరి, బుక్కరాజు తిరుపతి, ఎంసీపీఐయూ తుంగతుర్తి డివిజన్ ఇన్‌చార్జ్ ఈదుల వీరపాపయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంపీ ఉత్తమ్


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ ఉత్తమ్

హుజూర్‌నగర్: మండల కేంద్రంలోని కల్వరి టెంపుల్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం హుజూర్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఏడాదిలో ప్రజలంతా సుఖసంతోషాల తో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కల్వరి టెంపుల్ వ్యవస్థాపకుడు డాక్టర్ పి. సతీష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు అజీజ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిజంతోనే సమసమాజ స్థాపన

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి


లక్ష్మీనర్సయ్య సంతాప సభలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

గరిడేపల్లి: కమ్యూనిజంతోనే సమసమాజ స్థాపన సాధ్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కీతవారిగూడెంలో సీపీఎం సీనియర్ నాయకుడు గుడెపు లక్ష్మీనర్సయ్య సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎర్ర జెండాతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని నమ్మిన వ్యక్తి లక్ష్మీనర్సయ్య అని అన్నారు. అంతకుముందు లక్ష్మీనర్సయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా మండలంలోని అప్పన్నపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న యడవెల్లి కోటిరెడ్డి, జాన్‌రెడ్డిని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యాకుబ్, పారేపల్లి శేఖర్‌రావు, తుమ్మల సైదయ్య, జుట్టుకొండ వెంకటేశ్వర్లు, సర్పంచ్ జ్యోతి రామారావు, ఎంపీటీసీ చాంద్‌మియా, నర్సయ్య, వెంకటేశ్వర్లు, వెంకయ్య, మట్టయ్య, వెంకటాచారి, శ్రీనివాస్, రామస్వామి, శ్రీను తదితరులున్నారు.

గోదావరి జలాల నిలిపివేత

అర్వపల్లి: సూర్యాపేట జిల్లాకు గోదావరి జలాలను శనివారం తాత్కాలికంగా నిలిపివేశారు. కరీంనగర్ సమీపంలో ఎస్సారెస్పీ కాల్వకు గండిపడే అవకాశం ఉండడంతో మరమ్మతుల నిమిత్తం తాత్కాలికంగా రెండో దశకు ఎల్‌ఎండీ నుంచి నీటిని నిలిపివేసినట్టు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం 700 క్యూసెక్కులు వదిలినప్పటికీ అవి కూడా పూర్తిగా నిలిపివేశారు. మరో మూడు రోజుల్లో నీటి పునరుద్ధరణ జరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

నర్సరీల పరిశీలన


మఠంపల్లి నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ ఏపీడీ పెంటయ్య

మఠంపల్లి: హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను వచ్చే ఏప్రిల్ నాటికి ఏపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ ఏపీడీ డాక్టర్ పెంటయ్య సూచించారు. శనివారం మండలంలోని మఠంపల్లి, చౌటపల్లి, అల్లీపురం తదితర గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట సర్పంచులు జోజి, కృష్ణవేణి, ఏపీఓ ఉమ, టీఏలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

● బంధువుల అంత్యక్రియల్లో పాల్గొని వెళ్తుండగా ఘటన

చిట్యాల: బంధువుల అంత్యక్రియల్లో పాల్గొని వెళ్తున్న వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండల రెడ్డిబావి గ్రామానికి చెందిన నందగిరి ఇస్తారి(70) చిట్యాల మండలం వెంబావి గ్రామంలో తమ బంధువులు మృతిచెందితే అంత్యక్రియల్లో పాల్గొనేందుకు టీవీఎస్ ఎక్సెల్‌పై వచ్చాడు. అంత్యక్రియల అనంతరం తిరిగి తన స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో వెలిమినేడు గ్రామ శివారులో పిట్టంపల్లి గ్రామానికి వెళ్లే దారి వద్దకు రాగానే టీవీఎస్ ఎక్సెల్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇస్తారి అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో బొగ్గు లారీలో మంటలు



ప్రమాదానికి గురైన బొగ్గు లారీ

నకిరేకల్: సీజ్ అయిన బొగ్గు లారీని అటవీశాఖకు సంబంధించిన నర్సరీకి తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి మంటలు అంటుకున్నాయి. ఈ సంఘటన నకిరేకల్ మండలంలోని నెల్లిబండ శివారులో శనివారం చోటుచేసుకుంది. నకిరేకల్ ఫైర్ స్టేషన్ ఎస్‌ఐ భీముడు తెలిపిన వివరాల ప్రకారం.. పది రోజుల క్రితం కేతేపల్లి మండలం శివారులో అనుమతి లేకుండా బొగ్గును తరలిస్తున్న లారీని అటవీశాఖ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. బొగ్గు లోడుతో ఉన్న ఆ లారీని శనివారం మధ్యాహ్నం నెల్లిబండ శివారులోని ఫారెస్టు నర్సరీకి తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి లారీలోని బొగ్గుకు మంటలు అంటుకున్నాయి. వెంటనే అప్రమత్తమైన లారీ డ్రైవర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందివ్వడంతో వారు వచ్చి మంటలు ఆర్పారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

భువనగిరి: భువనగిరి పెద్దచెరువులో గల్లంతైన యువకుడి మృతదేహం శనివారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన పాలమాకుల యాదగిరి అలియాస్ స్వామి(20) గురువారం పెద్దచెరువులో ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక, పోలీసు సిబ్బంది చెరువులో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం రెండుగంటల పాటు శ్రమించి చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై కృష్ణ తెలిపారు.

మహిళ అదృశ్యం


నర్ర అనిత

రామన్నపేట: మండలంలోని సర్నేనిగూడెం గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు శనివారం ఫిర్యాదు అందిందని రామన్నపేట ఎస్‌ఐ ఎం. లక్ష్మయ్య తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. సర్నేనిగూడెం గ్రామానికి చెందిన నర్ర అనిత(42) డిసెంబర్ 28న దెబ్బతగిలిన తన చేతికి వైద్యం చేయించుకుంటానని చెప్పి రామన్నపేటకు వెళ్లింది. సాయంత్రం అయినా ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి ఇళ్లలో వెతికారు. ఎంత వెతికినా అనిత ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త సాలయ్య శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

577మంది ఎంపిక

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహిస్తున్న పోలీసు ఈ వెంట్స్‌లో శనివారం నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన అభ్యర్థులు 577మంది ఎంపికయ్యారు.













